# వనమా గెలుపే లక్ష్యంగా పనిచేస్తాం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సీతాలక్ష్మి



ఎమ్మెల్యే అభ్యర్థి వనమాతో కౌన్సిలర్లు

### మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 9: బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి వనమా వెంకటేశ్వరరావు గెలుపే లక్ష్యంగా పని చేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి స్పష్టం చేశారు. జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె ఇటీవల సీపీఐ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన కౌన్సిలర్లను పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎన్నికల ప్రచారంలో భాగంగా కౌన్సిలర్లు ఇంటింటికీ వెళ్లి బీఆర్ఎస్ గెలుపునకు బాటలు వేయాలన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు ప్రసాద్‌బాబు, పల్లపు లక్ష్మణ్, పరమేశ్ యాదవ్, బండి నరసింహా, సాహేరా బేగం, బోయిన విజయకుమార్, నేరెళ్ల సమైక్య, మాచర్ల రాజకుమారి, వై.శ్రీనివాస్‌రెడ్డి, పి.సత్యనారాయణచారి, ధర్మరాజు, నాయకులు మహ్మద్ యూసుఫ్, కూరపాటి సుధాకర్, ఎంఏ రజాక్, మాదా శ్రీరాములు, బాలిశెట్టి సుందర్‌రాజు, పిడుగు శ్రీను పాల్గొన్నారు.

### ఎమ్మెల్యేను కలిసిన కౌన్సిలర్లు..

కొత్తగూడెం అర్బన్, నవంబర్ 9: సీపీఐ నుంచి బీఆర్ఎస్‌లో చేరిన కౌన్సిలర్లు వై.శ్రీనివాస్‌రెడ్డి, బోయిన విజయకుమార్, పి.సత్యనారాయణచారి, నేరెళ్ల సమైక్య, మాచర్ల రాజకుమారి గురువారం పాత పాల్వంచలోని ఎమ్మెల్యే వనమా నివాసంలో ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిశారు. వనమా వెంకటేశ్వరరావు గెలుపే లక్ష్యంగా తామంతా కృషి చేస్తామని కౌన్సిలర్లు తెలిపారు.

## ప్రభుత్వ స్కూల్‌లో మాక్‌పోలింగ్




మాక్‌పోలింగ్‌లో కలెక్టర్ ప్రియాంక ఆల

పాల్వంచ, నవంబర్ 9: పాల్వంచ బొల్లోరిగూడెం ఉన్నత పాఠశాలలో సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ పార్టిసేషన్ ప్రోగ్రాం(స్వీప్)లో భాగంగా గురువారం అధికారులు 'మాక్ పోలింగ్' నిర్వహించారు. కార్యక్రమానికి కలెక్టర్ ప్రియాంక ఆల ముఖ్య అతిథిగా విచ్చేసి ఎన్నికలు, పోలింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో స్వీప్ నోడల్ ఆఫీసర్ త్రినాథ్ బాబు, జిల్లా స్వీప్ మెంబర్ పూసపాటి సాయికృష్ణ, ఎంఈవో శ్రీరాంమూర్తి, హెచ్‌ఎం మంగమ్మ పాల్గొన్నారు.

## గనిలో ప్రమాదాలను నివారించాలి



రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

మణుగూరు టౌన్, నవంబర్ 9: గని పరిధిలో అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వహిస్తూ ప్రమాదాలను నివారించాలని మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్, రక్షణ తనిఖీ బృందం కన్వీనర్ ఎస్.దామోదర్‌రావు అన్నారు. గురువారం వారు ఏరియా పరిధిలోని వర్క్‌షాపును సందర్శించి మాట్లాడారు. రక్షణతో కూడిన బొగ్గు ఉత్పత్తికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రక్షణ బృందం సభ్యులు ఎం.కేశవరావు, ఎ.నటరాజప్రసాద్, ఎస్.కృష్ణారావు, ఎం.రమేష్, ఏరియా ఇంజినీర్ ఎం.నర్సిరెడ్డి, సేఫ్టీ అధికారి జేవీ రమణ, డీజీఎం మధుసూదన్, పీకేవోసీ ప్రాజెక్టు మేనేజర్ దండమూడి రాంబాబు, రక్షణ అధికారి లింగబాబు, రాజిరెడ్డి, విజయ్‌పాల్, ప్రవీణ్, ఎస్డీ నాసర్‌పాషా, మెహబూబ్‌పాషా పాల్గొన్నారు.

## దగా కోరు కాంగ్రెస్ పార్టీ



మాట్లాడుతున్న ఎడవల్లి కృష్ణ

పాల్వంచ, నవంబర్ 9: కాంగ్రెస్ పార్టీ దగాకోరు అని, ఐదేళ్ల నుంచి తాను పార్టీ కోసం అహర్నిశలు పాటుపడినా టికెట్ ఇవ్వలేదని ఎడవల్లి కృష్ణ విమర్శించారు. పాల్వంచలోని ఆయన స్వగృహంలో గురువారం తన అనుచరులతో కలిసి నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. రెండు నెలల క్రితం పార్టీలో చేరిన వారికి అశ్వారావుపేట, పినపాక, సత్తుపల్లి, ఇల్లెందు నియోజకవర్గాల నుంచి పార్టీకి టికెట్లు ఇచ్చారని మండిపడ్డారు. ఇతర పార్టీ నుంచి వచ్చిన తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డిని అందలం ఎక్కించారన్నారు. బీసీ నాయకుడైన తనకు గుర్తింపు ఇవ్వలేదన్నారు. తనను కాంగ్రెస్ అధిష్టానం మోసం చేసిందన్నారు. తన అనుచరుల అభీష్టం మేరకు సరైన నిర్ణయం తీసుకుంటామన్నారు. త్వరలో వివరాలు ప్రకటిస్తామన్నారు. సమావేశంలో నాయకులు నూకల రంగారావు, మల్లికార్జున్, వెంకన్న, బీఎన్ చారి పాల్గొన్నారు.

## ఓటర్లను చైతన్యపర్చేందుకు కళాజాత

చుంచుపల్లి, నవంబర్ 9: చుంచుపల్లి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో గురువారం జిల్లా పౌర సంబంధాలశాఖ అధికారి శీలం శ్రీనివాస్ ఆధ్వర్యంలో కళాకారులు ఓటు హక్కుపై సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. 30న ఉదయం 7 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో మందా మంగమ్మ, ఎంపీవో గుంటి సత్యనారాయణ, ప్రిన్సిపాల రమేశ్, విద్యానగర్‌కాలనీ ఈవో బొంతు బాబురావు, ఆర్ఐ గుగులోత్ మంగ్యా, అధ్యాపకులు ఉన్నారు.

## అనుక్షణం అప్రమత్తం.. ప్రజల రక్షణ కోసం

### 'గూడెం'లో పోలీస్‌శాఖ ఉన్నతాధికారుల రహస్య సమీక్ష

కొత్తగూడెం క్రైం, నవంబర్ 9: అసెంబ్లీ ఎన్నికల వేళ పోలీస్‌శాఖ మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నది. శాంతిభద్రతల పరిరక్షణ కోసం చర్యలు తీసుకుంటున్నది. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నది. దీనిలో భాగంగా గురువారం లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని సింగరేణి ఇల్లెందు అతిథి గృహంలో గ్రేహౌండ్స్ అదనపు డీజీపీ విజయ్‌కుమార్, ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావుతోపాటు ఖమ్మం, భద్రాద్రి, మహబూబాబాద్ జిల్లాలకు చెందిన పోలీస్ అధికారులతో రహస్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఏజెన్సీలోని సరిహద్దు ప్రాంతాల్లో నిఘా, ఎన్నికల నిర్వహణ, బందోబస్తుపై చర్చించినట్లు తెలుస్తున్నది. సమావేశంలో ఖమ్మం సీపీ విష్ణు ఎస్ వారియర్, భద్రాద్రి ఎస్పీ డాక్టర్ వినీత్ గంగన్న, మహబూబాబాద్ ఎస్పీ సంగ్రామ్ సింగ్ పాటిల్ పాల్గొన్నారుపాల్గొన్నారు.

## హరిప్రియ నామినేషన్‌కు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు



బయలు దేరుతున్న బీఆర్ఎస్ శ్రేణులు

టేకులపల్లి, నవంబర్ 9: ఇల్లెందు నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్ వేస్తున్న హరిప్రియనాయక్‌కు మద్దతుగా మండలం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు ,అభిమానులు, ప్రజలు గురువారం మండల అధ్యక్ష,కార్యదర్శులు బొమ్మెర్ల వరప్రసాద్ గౌడ్, బోడ బాలునాయక్‌ల ఆధ్వర్యంలో మండలం నుంచి ద్విచక్ర వాహనాలపై భారీ ర్యాలీగా ఇల్లెందు బయలుదేరారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి ఆర్వో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లారు. కార్యాక్రమంలో బానోత్ రామానాయక్, బానోత్ కిషన్‌నాయక్, చీమల సత్యనారాయణ, బర్మవత్ శివకృష్ణ, ఇస్లావత్ బాలునాయక్, మాలోత్ పూల్‌సింగ్‌నాయక్, కుమ్మరి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## రామానుజాచార్యుల దివ్య విగ్రహ ప్రతిష్ఠ

టేకులపల్లి, నవంబర్ 9: స్థానిక కోదండ రామాలయంలో రామానుజచార్యుల దివ్య విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా చివరి రోజు గురువారం విగ్రహ ప్రతిష్ఠ, విగ్రహ ఊరేగింపు, యజ్ఞశాలలో యజ్ఞ యాగాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా రాధ, సైదులు నాయక్ దంపతులు, సర్పంచులు బోడ నిరోష, బోడ సరిత, ఏపీలోని నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీరరెడ్డి సతీమణి కుడితి కల్యాణి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## 'ముఠా నాయకుడు పొంగులేటి'

ఇల్లెందు, నవంబర్ 9ః మోసకారులకు, జంప్ జిలానీలకు, డబ్బులకు అమ్ముడు పోయే వారికి టికెట్లు ఇస్తూ కాంగ్రెస్ పార్టీ కార్పొరేట్ పార్టీగా మారిందని ఇల్లెందు కాంగ్రెస్ పార్టీ టికెట్ ఆశించిన భంగపడ్డ భూక్యా మంగిలాల్ ఘాటు వ్యాఖ్యలు చేశాడు. గురువారం తహశీల్దార్ కార్యాలయంలో నామినేషన్ దాఖలు చేసిన అనంతరం మీడియాతో మాట్లాడాడు. పార్టీని నమ్ముకొని ఇన్నాళ్లు ఇక్కడ పనిచేసిన వారిని కాదని పార్టీని మోసం చేసిన కోరం కనకయ్యకు టికెట్ ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశాడు. జిల్లాలోని పినపాక, అశ్వారావుపేట, ఇల్లెందు నియోజకవర్గాల్లో పార్టీకి సంబంధంలేని పాయం వెంకటేశ్వర్లు, ఆదినారాయణ, కోరం కనకయ్యలకు పార్టీ టికెట్లను ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు.

## ప్రజా ఆశీర్వాద బహిరంగ సభకు ఏర్పాట్లు ముమ్మరం



భూమిని చదును చేస్తున్న దృశ్యం..

బూర్గంపహాడ్, నవంబర్ 9: మండల పరిధిలోని లక్ష్మీపురంలో ఈనెల 13న జరుగనున్న సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభకు ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. సభకు నాలుగు రోజులు మాత్రమే సమయం ఉండడంతో ప్రభుత్వ విప్ రేగా కాంతారావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు ఏర్పాట్లను వేగవంతం చేశాయి. సుమారు 10 ఎకరాల విస్తీర్ణంలో సభా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## వెంకటేశ్వరస్వామి ఆలయంలో చోరీ

అశ్వాపురం, నవంబర్ 9: నెల్లిపాక పంచాయతీ పరిధిలోని నెల్లిపాక బంజర్‌లో అభినవ వెంకటేశ్వరస్వామి ఆలయంలోని హుండీని గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని దుండగులు ప్రవేశించారు. హుండీని ధ్వంసం చేసి నగదుతో ఉడాయించారు. కొన్నిగంటల తర్వాత ఆలయ పరిధిలో చోరీ జరిగిందని గుర్తించిన పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నగదు అపహరణకు సంబంధించిన వీడియోలను సీసీ కమెరాలో గుర్తించారు. చోరీ ఘటనపై ఎస్సై తిరుపతిరావు కేసు నమోదు చేశారు.

## బాధితురాలికి ఆర్థిక సాయం

పినపాక , నవంబర్ 9: టి.కొత్తగూడెం గ్రామానికి చెందిన మౌనిక అనే గర్భిణి కొంత కాలం నుంచి నరాల సంబంధిత వ్యాధితో బాధపడుతూ మంచానికి పరిమితమైంది. సమాచారం అందుకున్న 'జనం కోసం.. మనం' అనే స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు గురువారం బాధితురాలి వైద్యఖర్చులకు రూ.10 వేల ఆర్థిక అందజేశారు.

## బియ్యం వితరణ..

గోపాలరావుపేటకు చెందిన చిర్ర సుగుణమ్మ (55) ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. మృతురాలు దశదిన కర్మలకు ఎంపీటీసీ చింతపంటి సత్యం గురువారం 50 కిలోల బియ్యాన్ని వితరణగా అందజేశారు.

## బొగ్గు నాణ్యత వారోత్సవాలు ప్రారంభం

కొత్తగూడెం సింగరేణి, నవంబర్ 9: సింగరేణి కొత్తగూడెం కార్పొరేట్ ఏరియా పరిధిలో గురువారం బొగ్గు నాణ్యత వారోత్సవాలు ప్రారంభమయ్యాయి. కార్పొరేట్ క్వాలిటీ జీఎం సయ్యద్ హబీబ్ హుస్సేన్ నాణ్యతా పతాకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీజీఎం క్వాలిటీ లోకనాథన్, అడిషనల్ మేనేజర్ వినోద్‌కుమార్, ఎస్ఈ మంగిలాల్ పాల్గొన్నారు.